ఈ వారం కథ

# రెండు ముఖాల మనిషి

-షెహనాజ్



ఈ ప్రపంచంలో వివిధ రకాల మనుషులున్నట్లే - వివిధ రకాల మనస్తత్వాలు కలిగిన వాళ్ళూ ఉన్నారు.

అందులో మంచి స్వభావం కలిగిన వాళ్ళు - దుష్ట స్వభావం కలిగిన వాళ్ళూ ఉన్నారు.

కాని ద్వంద్వ ప్రవృత్తిని కలిగిన వింత స్వభావం కలిగిన వాళ్ళని కనుక్కోవటం మాత్రం మహాకష్టం.

సుబ్బారావు యీ కోవకి చెందినవాడు కావటంతోనే అతని అసలు స్వరూపం తెలుసుకునేసరికి చాలా ఆలస్యమై పోయింది.

సుబ్బారావంటే మా ఆఫీసులో అందరికీ అదోరకమైన క్రేజ్. హీరో వర్షిప్ ఏర్పడిపోయింది.

అందుక్కారణం - అతను ఆఫీసులో అడుగుపెట్టాడంటే అందరి మొహాల్లో వెలుగు వచ్చేస్తుంది. నోరు విప్పాడంటే అతను వేసే జోకులకు నవ్వలేక చచ్చేవాళ్ళం. అలా మా ఆఫీసు స్టాఫును - కడుపుబ్బ నవ్విస్తూ హుషారుగా కన్పించేవాడు.

అతనెప్పుడూ అలా నవ్వుతూ నవ్విస్తూ ఉండటంతో మా ఆఫీసులోని కొందరు అతనికి 'నవ్వుల్రావ్' 'ఆనందరావు' అని మారుపేర్లను పెట్టేశారు.

ఇక మా లేడీస్ స్టాఫ్‌కు అతనెంత అభిమాన పాత్రుడో మాటల్లో చెప్పటం కష్టం. అతనిపట్ల వల్లమాలిన ప్రేమాభిమానాలను చూపిస్తుంటారు. కారణం - ఒక విధంగా అతను వాళ్ళందరికీ ఆపద్బాంధవుడు కావటమే.

వారికి ఏ కష్టమొచ్చినా ఆదుకుంటూ ఉంటాడతను. ఎవరికి ఎలాంటి సహాయం కావాలన్నా చిటికెలో చేసేస్తుంటాడు.

'ఏమండోయ్ సుబ్బారావుగారు మా వాడికి కాలేజీలో సీటు లభించేటట్టు లేదట. ఆ కాలేజీ ప్రిన్సిపాల్ మీకు మంచి మిత్రుడని చెప్పినట్టు గుర్తు. మావాడు మరీ దిగులుపడి పోతున్నాడండోయ్. మీరు మా వాడి సీటు విషయంలో కొంత శ్రద్ధ తీసుకోవాలి సుమా'

అని ఎవరో ఒకరు అడగటం - దానికి అతను వెంటనే రియాక్టయి,

'మీరు దిగులు పడకండి మేడమ్. ఇదిగో ఆ పనిమీదే వెళ్తున్నాను. మీ అబ్బాయికి సీటు ఎలా ఇవ్వడో చూస్తాను. నా మాట కాదని ఆ ప్రిన్సిపాల్ బతికి బట్టకట్ట గలడా? ఆ కాలేజీ తిరిగి నడవగలదా?' అంటూ ఇంతెత్తున ఎగిరి ఆవేశపడిపోతూ స్కూటర్ వేసుకుని వెళ్ళిపోయేవాడు.

అదేం చిత్రమోకానీ అతనలా ఆఫీసు టైమ్‌లో సైతం బయటికి వెళ్ళినా మేనేజర్‌తో సహా ఎవరూ పల్లెత్తు మాట అనటానికి కూడా సాహసించేవారు కారు.

బహుశా ఎవరికి ఏ అవసరం పడ్తుందోనన్న ఆలోచన వారిని అడ్డుకునేది కాబోలు. దాంతో అతనికి ఏ అడ్డూ అదుపూ ఉండేవికావు.

అక్కడ అందరి దృష్టిలో అతనో పరోపకారిగానూ - స్నేహశీలిగానూ - ఉత్తముడిగానూ నిలిచిపోవటంతో - ఓ ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకోగలిగాడు.

వెళ్ళినచోట కార్యాన్ని ఎలా సాధించుకు వచ్చేవాడోగాని - విజయగర్వంతో తిరిగి వచ్చేవాడు.

'మేడమ్. మీ అబ్బాయికి సీటు ఖాయం. రేపు మీ అబ్బాయిని కాలేజీకి వెళ్ళి నా పేరు చెప్పి ఫీజు కట్టేసి రమ్మనండి' అని చెప్పటంతో -

ఆ మేడమ్‌గారు ఆనందంతో తబ్బిబ్బై పోవటం జరిగేది.

మరి కొద్ది రోజులకు ఇంకొకరి ఫిర్యాదు. 'సుబ్బారావు గారు గత నాలుగైదు రోజులుగా మా కాలనీకి పంపులో నీళ్ళు రావటం లేదండీ. కాస్త మున్సిపాలిటీ వాళ్ళకి ఫోన్ చేసి చెప్పగలరా?' అని అడగటం తడవుగా, 'ఓస్. ఇంతేనా. మన మున్సిపల్ ఛైర్మన్ నా శిష్యుడే. కమిషనర్ మనవాడే. ఇంజనీర్ మా ఊరివాడే. ఎవరూ నా మాట కాదనరు. నా మాట వాళ్ళకి వేదవాక్కు. ఇప్పుడే ఫోన్ చేసి నాలుగు దులిపేస్తాను. నాలుగు రోజులుగా నీళ్ళు సరఫరా కాకపోతే ఎలా బతికేదట? అయినా ఆ మాట ముందే చెప్పొచ్చు కదా మేడమ్. మా ఇంట్లోవి నాలుగు బిందెల నీళ్ళు తెచ్చి పెట్టేవాణ్ణి కదా' అంటూ తెగ హైరానా పడిపోయేవాడు.

అతని మంచితనానికి ఆవిడ కళ్ళు చెమర్చేవి.

మనసులోనే వేయి నోళ్ళ పొగిడేది.

మరో నాలుగురోజులు ఎక్కువ తిన్న మరొకరి విన్నపం. 'సుబ్బారావుగారూ మా తమ్ముడు పదోక్లాసు తప్పేట్టున్నాడు. లెక్కల పేపరు బాగా చెయ్యలేదు. అందులో ఫెయిలవుతానంటున్నాడు. రాత్రింబవళ్ళు అదే దిగులయిపోయిందంటే నమ్మండి. ఇక మీరే దిక్కు మాకు' అని చెపితే - దానికి అతను ఎంతో యిదయిపోతూ, 'నేనుండగా మీకెందుకింత దిగులు. మీ వాడి నెంబరు వివరాలు రాసివ్వండి. హైదరాబాద్ వెళ్ళి పని పూర్తి చేసుకుని వస్తా. మీ వాడి నెంబర్ ఫస్ట్‌క్లాసులో కన్పించాలి' సవాలు చేస్తున్నాడిలా చెప్పేవాడు.

ఇదంతా చూస్తున్న మాకు అతను ఒక హీరోలా కన్పించేవాడు. అతనితో సంప్రదించనిదే ఏ పనీ చేయకపోవటమంతటి విశ్వాసం ఏర్పడిపోయింది అతనిపట్ల మాకందరిలో.

మనిషికి తగ్గట్టు నీట్‌గా డ్రెస్ చేసుకోవటం అతని ప్రత్యేకత.

జీన్స్ ప్యాంట్లు, టీ షర్టులు వేసుకుని హుషారుగా కుర్రాడిలా నవ్వుతూ నవ్విస్తూ ఆఫీసంతా కలియ తిరుగుతుండేవాడు.

మాకు టైం ఎలా గడిచిపోతుందో తెలిసేది కాదు.

సుబ్బారావు రావటం ఏ మాత్రం ఆలస్యమైనా ఆఫీసంతా స్తబ్దంగా తయారయ్యేది.

'ఏమిటోయ్ సుబ్బారావు లేడా. ఆఫీసు మరీ డల్‌గా కన్పిస్తుందేమిటి?' అంటూ చెప్పుకుని నవ్వుకునేవాళ్ళం.

అతను రాగానే తిరిగి నవ్వుల జల్లులు కురిసేవి.

ఇలా సుబ్బారావు మాలో ఒక స్నేహశీలిగా, మంచితనం మూర్తీభవించిన వ్యక్తిగా కలిసిపోయాడు.

కాని తరువాత జరిగిన దుస్సంఘటన - మా అభిప్రాయాలు తప్పని రుజువు చేసింది.

ఆ రోజు -

హఠాత్తుగా పిడుగుపాటు లాంటి వార్తను వినాల్సి వచ్చింది.

సుబ్బారావు భార్య తన ఇద్దరు పిల్లలతోపాటు కాలువలో దూకి ఆత్మహత్య చేసుకుందిట.

ఈ వార్త మమ్మల్ని దిగ్భ్రాంతిని కలిగించింది.

ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తూ హుషారుగా తిరిగే సుబ్బారావు లాంటి వ్యక్తికి ఇలాంటి విపత్తు వచ్చి పడిందేమిటా అంటూ విస్తుపోయాం.

అయినా అతని భార్యకి పిల్లలతో సహా ఆత్మహత్య చేసుకోవల్సినంత కష్టమేమొచ్చింది? సుబ్బారావు నిత్య సంతోషి కదా! ఎదుటి వారిని నవ్వించటమే తప్ప బాధించటం ఎరుగని వ్యక్తి. మరి ఆ ఇల్లాలికి బాధ కలిగించే విషయమేం జరిగి ఉంటుంది? అతనితో ఇన్నేళ్ళుగా స్నేహ సంబంధాలు కొనసాగిస్తున్నా అతని కుటుంబంతో మాత్రం పరిచయం కలగలేదు. అడపాదడపా తన భార్యాబిడ్డల గురించిన ప్రస్తావన తెచ్చినా వారి గురించి ఎంతో ప్రేమగా చెప్పుకొచ్చేవాడు.

తన భార్య గుణగణాల గురించి - తన పిల్లల తెలివితే టల గురించి గొప్పగా చెప్పేవాడు. మరి ఈ ఆత్మహత్యల వెనుక అసలు రహస్యమేమిటా అనుకుంటూ తర్జనభర్జ నలు చేసుకుంటూనే అతని భార్యాపిల్లల శవాలను చూసొచ్చాం.

అక్కడ హృదయ విదారకమైన దృశ్యాలను చూడవ లసి వచ్చింది. ఆ తల్లీ పిల్లల శవాలు కాలువలో కొట్టుకు పోయి ఎక్కడో దూరంగా పడ్డాయి. ఆ శవాలను ఆసుప త్రికి తరలించి - అక్కడి తతంగం ముగించుకుని వ్యానులో తీసుకువచ్చారు.

అక్కడ సుబ్బారావు దుఃఖ తీవ్రతతో కాబోలు అరచే తుల్లో మొహం దాచుకుని కూర్చుని ఉన్నాడు.

అతని చుట్టూ చేరిన కొంతమంది మాటలతో అతనిని తూట్లు పొడుస్తున్నారు. వాళ్ళల్లో అతని అత్తమామలు కూడా ఉన్నారు.

'ఒరేయ్. చివరికి మా బిడ్డని పొట్టనబెట్టుకున్నావ్ కదరా. దాని ప్రాణాలు తీసేంతవరకు వదిలిపెట్టలేదు కదరా మూర్ఖుడా. పెళ్ళయినటినాటి నుంచి యేనాడయినా ఆ అమ్మాయిని చల్లగా చూశావా? చల్లగా మాట్లాడి ఎరు గుదువా? దానిని పస్తులుంచావ్. తిట్టావ్. కొట్టావ్. నానా చిత్రహింసలు పెట్టావ్.

కాని ఏనాడూ నీ గురించి నోరు విప్పి చెడు చెప్పలేదు. ఆ అమాయకురాలిని భార్యగా కాకపోయినా కనీసం సాటి మనిషిగానైనా చూడలేకపోయావ్. పెళ్ళాం బిడ్డల్ని పట్టుకుని గొడ్డును బాదినట్లు బాదేవాడివి. నీ దెబ్బలకు తట్టుకోలేక పసివాడు ఇంటి నుండి పారిపోయాడు. వెళ్ళి నాలుగేళ్ళయింది. చచ్చాడో బతికాడో తెలీదు. ఆ బాధని కూడా కడుపులోనే దాచుకుంది పిచ్చిది. ఏదో ఒకనాడు ఇలాంటి అఘాయిత్యం జరుగుతుందని అనుకుంటూనే ఉన్నాం. కాని మా బిడ్డని కాపాడుకోలేక పోయాం'

ఆ కన్నవాళ్ళ దుఃఖాన్ని చూసి మా హృదయాలు ద్రవించి పోయాయి.

అక్కడున్నంతసేపు - వాళ్ళ మాటల్నిబట్టి మాకు అర్థ మయిందేమిటంటే ఇన్నాళ్ళూ మేం సుబ్బారావులోని ఒక భాగాన్నే చూశాం. అవతలి మరో భాగాన్ని చూసే అవ కాశం కలగలేదు. అది నిలువెల్ల విషమని తేలింది. అత నిలో కర్కోటకుడు దాగి ఉన్నాడు.

మనిషి ప్రాణాలను తీసేటంత కర్కశ హృదయం ఉంద తనిలో. ఈ ప్రపంచంలోని ప్రతి మనిషికి అతి విలువైనది తన ప్రాణం. అలాంటిది తన ప్రాణాలతోపాటు - ఇద్దరు కన్నబిడ్డల ప్రాణాలను కూడా తీసిందంటే - హద్దులు దాటిన మానసిక క్షోభే ఈ దారుణానికి వొడిగట్టించింది.

ఆ క్షోభకి కారణం సుబ్బారావులోని హింసా ప్రవృత్తే - అతను తేనెపూసిన కత్తి.

బరువయిన హృదయాలతో అక్కడ్నుంచీ బయట పడ్డాం.

సుబ్బారావు అసలు స్వరూపం ఇదా?

ఇంకా నమ్మకం కుదరటంలేదు.

పోలీసులు కేసు నమోదు చేశారు.

అతను నెలరోజులపాటు ఆఫీసుకి సెలవుపెట్టి సొంతూరు వెళ్ళిపోయాడు.

త్వరలో అతనికి ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్టు ఆర్డర్స్ వస్తాయని భావించాం.

రోజులు గడిచేకొద్దీ అతని గురించిన కొన్ని చేదు నిజాలు బయటపడసాగాయి. అతనొక శాడిస్ట్ అనీ - భార్యాబిడ్డలను రకరకాలుగా చిత్రహింసలకు గురిచేసే వాడనీ, అతని హింసలను భరించలేక అతని పెద్దకొ డుకు పదేళ్ళ ప్రాయంలో ఇంట్లోంచి పారిపోయాడనీ - ఇప్పటివరకు అతని జాడ తెలియరాలేదనీ, అతని చిత్ర హింసలు మితిమీరటంతోనే ఆవిడ ఇలాంటి అఘాయి త్యానికి పాల్పడిందని, అప్పటికీ ఎన్నోసార్లు అతని వేధిం పులకు తాళలేక పుట్టింటికి వెళ్ళిపోయేదని, తిరిగి రప్పిం చుకునేవాడని ఇలా ఎన్నోవిషయాలు వినాల్సి వచ్చింది.

ఒక వ్యక్తి గౌరవ మర్యాదలను - ప్రేమాభిమానాలను సంపాదించుకోవాలంటే కొంతకాలం పడ్తుంది.

కాని అదే గౌరవ మర్యాదలను - ప్రేమాభిమానాలను పోగొట్టుకోవాలంటే క్షణకాలం కూడా పట్టదు.

మా దృష్టిలో ఆకాశమంత ఎత్తుకు ఎదిగిన సుబ్బారావు ఒక్కసారిగా అధఃపాతాళానికి చేరిపోయాడు.

ఓ మంచి భర్తగా - ఓ మంచి తండ్రిగా రాణించలేని వాడు ఓ మంచి మిత్రుడు మాత్రం ఎలా కాగలుగు తాడు.

రాక్షస ప్రవృత్తిని కలిగినవాడు బయటికి తళుకులు బెళుకులు ప్రదర్శిస్తే మంచి మనిషి కాగలుగుతాడా?

ఓ రెండు మూడు నెలల తరువాత -

ఆ కేసు నుండి ఎలా బయటపడ్డాడో - ఎలా మేనేజ్ చేయగలిగాడో తెలీదుగాని ఆఫీసులో ఊడిపడ్డాడు.

మునుపటిలా తయారై - హుషారుగా ఆఫీసులో అడు గుపెట్టిన అతనిని కనీసం ఎవరూ మర్యాదకయినా విష్ చెయ్యలేదు. అతను నవ్వించబోయినా నవ్వలేదెవరూ.

లేడీస్ స్టాఫ్ అయితే అతనిని యమ కింకరుడిని చూసి నట్లు ఝడుసుకుని పక్కకి తొలగారు.

రోజులు గడిచినా పరిస్థితి మారలేదు.

కొన్ని రోజుల తరువాత - అతను ఏదో దూర ప్రదేశా లకి ట్రాన్స్‌ఫర్ చేయించుకుని వెళ్ళిపోయాడని వేరే చెప్ప క్కర్లేదు.

★

## జనం.. ప్రభంజనం

ఇక్కడి నుండీ ఇక వచ్చే 200 సంవత్సరా లలో ప్రతిచోటా ఎక్కడ చూసినా జనం విపరీ తంగా పెరిగిపోతారు. ఎక్కువగా భాగ్యవంతులై పోతారు. ప్రకృతి శక్తులను స్వాధీనం చేసుకుం టారు. అప్పటికి ప్రపంచ జనాభా సుమారు 15 వేల మిలియన్లు. ఇప్పుడున్న 1300 డాలర్ల తలసరి ఆదాయం 20 వేల డాలర్లకి మించిపో తుందని ఫ్యూచరిస్ట్ హెర్మన్‌ఖాన్ ప్రకటన.

## కల నిజమైన వేళ

1951వ సంవత్సరంలో విడుదలైన ఇంగ్లీష్ చిత్రం 'డెస్టినేషన్ మూన్' మనిషి చంద్ర మండ లంలో దిగడం గురించి ముందుగా చిత్రీకరిం చింది. ఆ తర్వాత 18 సంవత్సరాలలో అసాధ్య మని అనిపించే భావన వాస్తవమయింది. జూలై 20, 1969న నీల్‌ఆర్మ్‌స్ట్రాంగ్ అమెరికన్ లూనార్ మాడ్యూల్ నుంచి దిగి చంద్ర మండలం మీద కాలుమోపడం విశేషం.

## జంతువుల నిఘంటువు

హంగేరీలోని బుడాపెస్ట్‌లో ఒక పబ్లిషింగ్ కంపెనీ ఏడు భాషలలో ఒక నిఘంటువును ప్రచు రించింది. ఇందులో 12వేల ఎంట్రీలు, ఒక లక్షా యాభైవేల జంతువుల వివరాలు ఉంటాయి. ఈ నిఘంటువు సంపాదకుడు లాస్‌జ్లో గోస్మాన్‌కి 10 వేల పైగా ఆధారాలను పరిశీలించి అచ్చు వేయటానికి 30 సంవత్సరా లకు పైగా పట్టింది.

-పి.వి. రమణకుమార్

## యస్..బాస్..!

సత్యమూర్తి

